# బాలల ప్రగతి దేశ భవితకు సోపానం

దేశ భవిష్యత్‌కు కొలబద్ధ బాలల ప్రగతి. వారి ముఖాలు దేశ ప్రగతికి దర్పం. 2001 జనాభా లెక్కల ప్రకారం 0–14 సంవత్సరాలలోపు బాల, బాలికలు 35 శాతం. అయితే జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాల ప్రకారం- మూడు సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన 46 శాతం పిల్లలు కనీస బరువు లేరు. 39 శాతం గిడసబారితే, 20 శాతం తీవ్ర పౌష్టికాహార లేమికి గురైతే, 80 శాతం రక్తహీనతతో బాధపడుతుంటే, జన్మించిన ప్రతి 1000 మంది శిశువుల్లో 67 మంది మరణిస్తున్నారు. పౌష్టికాహార లోపం వల్ల ఐదేళ్లలోపు బాల బాలికల్లో ప్రతి రోజు 6,000 మంది చనిపోతున్నారు. ప్రపంచంలో పౌష్టికాహారలోపానికి గురవుతున్న 146 మిలియన్ల మంది పిల్లల్లో 56 మిలియన్ల మంది పిల్లలు భారతదేశానికి చెందినవారే. సహార దిగువనున్న ఆఫ్రికాలో 30 శాతం, చైనాలో 8 శాతం, పాకిస్థాన్‌లో 37 శాతం మాత్రమే పౌష్టికాహారలేమికి గురవుతున్నారు. భారతదేశంలో 440 మిలియన్ల ప్రజలు ఆర్థిక పిరమిడ్‌లో అట్టడుగున ఉంటే, ప్రతి సంవత్సరం 500,000 మంది పిల్లలు అంగవైకల్యంతో జన్మిస్తున్నారు. జనాభాలో 35 శాతమున్న బాలబాలికల కోసం వార్షిక బడ్జెట్‌లో కేవలం 4.86 శాతం మాత్రమే కేటాయిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా రెండు బిలియన్ల మంది ప్రజలు విటమిన్లు/ఖనిజాల లోపానికి గురైతే, అందులో 30 శాతం భారతదేశంలో నివశిస్తున్నారు. ఆర్థిక నిపుణుల అంచనాల ప్రకారం ఈ లోటు భారత ఆర్థిక వ్యవస్థకు వచ్చే సంవత్సరాల్లో 2,770,000 మిలియన్ రూపాయల నష్టం కలిగిస్తోంది.

ఒకవైపు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, ఇంకోవైపు తల్లిదండ్రుల పేదరికం వల్ల గాని, అనాథలవడం వల్ల గాని, వేరే గత్యంతరం లేక 12.6 మిలియన్ల మంది పిల్లలు కార్మికులుగా మారుతున్నారు. పట్టణ ప్రాంతంలో కంటే గ్రామీణ ప్రాంతంలో బాలకార్మిక వ్యవస్థ మరింత ఎక్కువ. 80 శాతం మంది బాల కార్మికులు వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు. పట్టణాల్లో కొన్ని రకాలైన పరిశ్రమల్లో బాలకార్మికులే ఎక్కువగా పనిచేస్తున్నారు. జైపూర్‌లో రత్నాల మెరుగు పనిలో, ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపూర్‌లో పలకల పరిశ్రమలో, వారణాసిలో సిల్కు చేనేత రంగంలో, అలీగఢ్‌లో తాళాల తయారీ పరిశ్రమలో, ఫిరోజా బాద్‌లో గ్లాస్ తయారీ పరిశ్రమలో, శివకాశిలో అగ్గిపెట్టెల, బాణసంచాల తయారీలో, కాశ్మీర్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో తివాచి నేతరంగంలో బాలలు తమ బాల్యాన్ని త్యాగం చేస్తున్నారు. ప్రతిరోజు 12–14 గంటలు పనిచేస్తున్నారు. అనేక మందికి తల్లిదండ్రుల, బంధుమిత్రుల ఆప్యాయత దొరకదు. చదువు కుంటూ, తోటి పిల్లలతో ఆడుకోవాల్సిన వయసులో ఎంతో మంది బాలలు కుటుంబ బాధ్యతను తమపై వేసుకొని బాల్యాన్ని చవిచూడలేకపోతున్నారు. మానసికంగా, శారీరకంగా అనేక హింసలకు గురవుతూ, సమాజంపై, తమపై ద్వేషాన్ని పెంచుకుంటూ క్రమేణా నేరప్రవృత్తికి అలవాటుపడి సంఘ విద్రోహ శక్తులుగా రూపాంతరం చెందుతున్నారు. ఇలాంటి

పరిస్థితుల్లో శిశుసంరక్షణ రాజ్య నైతిక, చట్టబద్ధమైన బాధ్యత. దురదృష్టవశాత్తు భారత ప్రభుత్వం శిశుసంక్షేమానికి తగిన చొరవ చూపించడంలేదు. ప్రభుత్వ పరంగా బడ్జెట్ కేటాయిం పులు అంతంతమాత్రమే. ఇతర దేశాలతో పోలిస్తే ఇండియా యువదేశం. ప్రపంచ జనాభాలో 19 శాతం పిల్లలు భారతదేశం లోనే ఉన్నారు. ఎక్కువ మంది బాలకార్మికులుగా మారి, లైంగిక వేధింపులకు గురవుతూ, శారీరక, మానసిక నిరాదరణకు బలి అవుతున్నారు. అలాగని ప్రభుత్వపరంగా, సామాజికపరంగా వీరు నిర్లక్ష్యానికి గురవుతున్నారని కాదు. రాజ్యాంగపరమైన రక్షణలతో పాటు, చట్టపరమైన మద్ధతు లభిస్తోంది. రాజ్యాంగంలోని 24వ ప్రకరణ బాలబాలికలను ఫ్యాక్టరీల్లో పనిచేయనివ్వడాన్ని నిషేధిస్తోంది. 39వ ప్రకరణలోని ఆదేశసూత్రం ప్రకారం పిల్లలను దోపిడికి గురిచేయడాన్ని నిషేధించారు. వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి అనుకూల పరిస్థితులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. 82వ రాజ్యాంగ సవరణ చట్టం(2002) మేరకు నిర్బంధ, ఉచిత విద్యను ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించారు. బాలకార్మిక వ్యవస్థను నిషేధిస్తూ 1986 సంవత్సరంలోనే చట్టం చేశారు. బాలకార్మిక వ్యవస్థపై కేంద్రప్రభుత్వం 1987లో జాతీయ విధానాన్ని ప్రకటించింది. 1994లో బాల కార్మిక విధానాన్ని నిషేధిస్తూ దానిని అమలుచేయడానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు. జాతీయ స్థాయిలో 100కు పైగా జాతీయ బాలకార్మిక ప్రాజెక్టులను కేంద్రప్రభుత్వం నిర్వహిస్తోంది. మధ్యాహ్న భోజన పథకం, సర్వశిక్ష అభియాన్ లాంటివి బాలల సంక్షేమాన్ని ఉద్దేశించినవి. పౌరసమాజం, స్వచ్ఛంద సేవాసంస్థలు ఈ కార్యక్రమాల నిర్వహణలో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి.

1975లో ప్రారంభించిన సమగ్ర శిశుసంరక్షణ పథకం ఆరు సంవత్సరాల్లోపు పిల్లలకు, పాలిచ్చే తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడానికి ఉద్దేశించింది. పిల్లల ఆరోగ్యం, మానసిక ప్రగతికి ఈ పథకం ఉపయోగపడుతుంది. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం అమలవుతుంది. వీటి అమలులో చిత్తశుద్ధి లోపించడం వల్ల, అవి నీతి పెరిగి పసిపిల్లలకు కేటాయించిన వనరులను ఉద్యోగులు, అధికారులు దుర్వినియోగపరుస్తున్నారు. 100 మిలియన్ల పిల్లలు ఈ కార్యక్రమ పరిధిలో లేరు. ప్రజల్లో చైతన్యం, రాజకీయ, ఉద్యోగ బృందవ్యవస్థలో నీతి నిజాయితీ లోపించినంతకాలం ఏ మంచి కార్యక్రమం కూడా ఆశించిన ఫలితాలను పొందలేదు. బాలల ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా, సమగ్ర శిశు సంరక్షణాభి వృద్ధి పథకంతోపాటు, ఉదీష, కిషోర శక్తి యోజన కార్యక్రమాలు అమలవుతున్నాయి. ప్రపంచ బ్యాంకు సహాయంతో ఉదీష కార్య క్రమం కింద అంగన్‌వాడి కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. కిషోర శక్తి యోజన కింద బాలికలకు పౌష్టికాహారం అందించడంతో పాటు, ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి వృత్తిపరమైన శిక్షణ ఇవ్వడం, బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని కలిగించే కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.

బాలల హక్కులను పరిరక్షించడానికి జాతీయ బాలహ క్కుల కమిషన్ 2007లో ఏర్పాటైంది. ఇది బాలల హక్కుల చట్టం(2005) పరిధిలోకి వస్తుంది. పనిచేసే తల్లుల బిడ్డలకు ఉయ్యాల సేవా పథకాన్ని 2006లో ప్రారంభించారు. వీధి బాలలకు వసతి, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణకై సమగ్ర పథకాన్ని

కేంద్రప్రభుత్వం ప్రారంభించింది. బాలలను అత్యవసర పరిస్థితుల్లో ఆదుకోవడానికి 24 గంటలు ఉచితంగా పనిచేసే టెలిఫోన్ సర్వీసు 73 పట్టణాల్లో ప్రారంభమైంది. బాలలకందించే సేవల్లో కనీస ప్రమాణాలు నెలకొల్పడానికి పిల్లల ఫౌండేషన్ ఏర్పాటైంది. బాల నేరస్థుల పరిరక్షణకు 2000 సంవత్సరంలో చట్టం అమల్లోకి వచ్చింది. అనాథ బాలల దత్తత కోసం 'కారా' అనే పథకం ప్రారంభించారు. భ్రూణహత్యలను నివారించడానికి, బాల్య వివాహాలను నిషేధించడానికి అమల్లో ఉన్న చట్టాలకు మరింత పదును పెట్టారు.

ఈ పథకాలన్నీ అర్థవంతంగా అమలై, బాలల ముఖాల్లో చిరుహాసం కనిపించాలంటే ఆహార భద్రత, ఆరోగ్యం, పారిశు ద్ధ్యం, సురక్షిత తాగునీరు, పౌష్టికాహారం, కుటుంబ సంక్షేమం, దారిద్ర్య నిర్మూలన మొదలైన కార్యక్రమాల మధ్య సమన్వయం అవసరం. అంతేకాకుండా పౌరసమాజం చొరవ, రాజకీయ చిత్తశుద్ధి, ఉద్యోగబృంద అంకితభావం పెరగాలి. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో బడ్జెట్ కేటాయింపుల్లో గణనీయమైన పెరుగుదల కనిపించాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సహకారం పెంపొందాలి. ప్రభుత్వ క్రియాశీలతతో పాటు, స్వచ్ఛంద సేవాసంస్థల కృషి, తోడ్పాటు కూడా అవసరం.